
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 19.0

ANDHRAJYOTHY 5

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

మంగళవారం 2 డిసెంబరు 2025



విచ్చలవిడిగా పెరిగిన శ్రమదోపిడీ

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి
- ముగిసిన యూనియన్ జిల్లా మహాసభలు

7



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి



మక్తల్ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



వేదికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో.. (ఎడమ నుంచి) ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మంత్రులు వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జీఎంఆర్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

ప్రేమిస్తే ప్రాణం.. మోసం చేస్తే.. పాతాళం




సభకు హాజరైన మహిళలు

పాలమూరు ప్రజలు ఆశీర్వదిస్తే గెలిచి.. ప్రాజెక్టులు పూర్తి చేయలేదు

- రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసి.. సంగంబండకు రూ.12 కోట్లు ఇవ్వలే
- జీఓ నెంబర్ 69ను తొక్కిపెట్టి.. పేట- కొడంగల్ లిఫ్టును పట్టించుకోలే
- రూ.5 వేల కోట్ల ప్రాజెక్టు తెస్తే.. కేసులతో సంవత్సరన్నర అడ్డుకున్నారు
- వద్దించే వాడు మీ బిడ్డనే.. ఎక్కడ కూర్చున్నా వడ్డించే బాధ్యత నాదే
- ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసుకునే బాధ్యత యువత తీసుకోవాలి
- మక్తల్ ప్రజాపాలన విజయోత్సవ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్/నారాయణపేట/మక్తల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'పాలమూరు ప్రజలు ప్రేమిస్తే ప్రాణం ఇస్తారు. మోసం చేస్తే పాతాళంలో తొక్కిపెడతారు. పాలమూరులో ఊరు లేకపోయినా.. పార్లమెంటులో నోరు లేకపోయినా తెలంగాణ వస్తే పాలమూరుకు మంచి జరుగుతుందనుకుంటే.. పదేళ్లు పాలించి జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, పాలమూరు-రంగారెడ్డి ఇలా ఏ ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేద'ని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు, మక్తల్ పట్టణాల్లో ముఖ్యమంత్రి సోమవారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ బహిరంగ సభలో ప్రసంగించారు. పదేళ్ల కాలంలో సాగునీటి రంగానికి రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టి.. పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదన్నారు. సంగంబండలో బండ పగులగొట్టడానికి రూ.12 కోట్లు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. చిట్టెం నర్సిరెడ్డి ప్రారంభించిన నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయడానికి 2014 ఉమ్మడి రాష్ట్రంలో తాను జీఓ నెంబర్ 69ను తెస్తే.. పదేళ్లు తొక్కిపెట్టి చేపట్టలేదని విమర్శించారు. జీఓ 69 పేరిట జలసాధన సమితి ఏర్పడి పోరాటం చేసినా ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు ఇవ్వడానికి తాపత్రేయపడలేదని అన్నారు. 2023 ఎన్నికల్లో ఈ ప్రాంత బిడ్డకు 12 మంది శాసన సభ్యులను గెలిపించి.. ముఖ్యమంత్రిని చేస్తే 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.5 వేల కోట్లతో మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తెచ్చానన్నారు. మళ్లీ కుట్రలు చేసి.. కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడంతో సంవత్సరంన్నర ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం ఆ పనులను ప్రారంభించుకోవడం తన జీవితంలో సంతోషకరమైన రోజని అన్నారు. ఈ ప్రాంతానికి మంత్రులుగా చేసినవారు గతంలో ఇతర ప్రాంతాల ముఖ్యమంత్రులకు బానిసలుగా ఉండేవారని, అందుకే పనులు చేయలేకపోయారని అన్నారు. ఎంఎస్‌కే

(మిగతా 6లో..)



38 నిమిషాల్లో ముగిసిన.. ముఖ్యమంత్రి పర్యటన

- ఆత్మకూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సీఎం హోదాలో తొలిసారి రావడంతో తరలొచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు

6

ఈ యాసంగికి.. నీరు లేనట్లే..?

- ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో బీడుగా మారనున్న పొలాలు
- జనవరి వరకు మాత్రమే నీటి విడుదల
- రేపు హైదరాబాద్‌లో ఇరిగేషన్ అధికారుల సమావేశం



కర్ణాటకలోని ఆర్డీఎస్ ప్రధాన ఆనకట్ట

అయిజ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో ఈ యాసంగికి నీరు లేనట్లే అని అధికారుల ద్వారా తెలుస్తోంది. నవంబరు నెలలో కర్ణాటక, ఏపీ, తెలంగాణ ప్రాంతాల ఎస్ఈలతో జరిగిన రెండో వాటర్ రివ్యూ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వర్షాకాలంలో కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఆశించిన మేరకు వరద చేరింది. నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ డ్యాం గేట్ల మార్పు నేపథ్యంలో నీరు దిగువకు వదలాల్సి వస్తోంది.

టీబీ డ్యాంలో మన వాటా

కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర డ్యాంలో తెలంగాణకు నీటి వాటా ఉంది. మన వాటా మేరకు అక్కడ నీరు వదిలితే కర్ణాటక రాష్ట్రంలోని రాజోళిబండ గ్రామం వద్ద తుంగభద్ర నదిపై ఆర్డీఎస్ ఆనకట్టను నిర్మించారు. అక్కడి నుంచి నీటిని మళ్లించి కాలువ ద్వారా తెలంగాణలోని పంట పొలాలకు వాడుకుంటారు. అందులో తెలంగాణ వాటా 15.02 టీఎంసీలు ఉంది. అందులో వానాకాలంలో 9 టీఎంసీలు, యాసంగిలో 6 టీఎంసీలు వాడుకోవాల్సి ఉంది.

టీబీ డ్యాం దుస్థితి

కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర డ్యాం ప్రమాదంలో పడింది. ఉన్న 33 గేట్లు సైతం ప్రమాదం అంచున ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గత వర్షాకాలంలోని వరద నీటి కారణంగా 2024 ఆగస్టు 10న 19వ గేటు కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన గేటు స్థానంలో నామమాత్రంగా స్టాప్‌లాక్ పెట్టారు. అదే విధంగా ఉన్న గేట్లలో 11, 18, 20, 24, 27, 28 గేట్లు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. వాటితో పాటు ఉన్న మిగతా గేట్లు సైతం తుప్పు పట్టినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం 33 గేట్లను మార్చి కొత్తవాటిని అమర్చాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. తుంగభద్ర డ్యాంకు మరమ్మతులు చేయాలంటే డ్యాంలోని నీటి సామర్థ్యం 40 టీఎంసీల దగ్గర నిలుపుదల చేసే అవకాశ ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నీటి నిల్వ 69 టీఎంసీలు ఉంది. రోజు 1 టీఎంసీ చొప్పున నీరు వదులుతున్నారు. ఈ ప్రకారంగా జనవరి 10వ తేదీ వరకు నీరు పారే అవకాశం ఉంది. మార్చి చివరి వరకు నీరిస్తేనే పంటలు పూర్తి అవుతాయి. దీంతో యాసంగిలో క్రాప్‌హాలిడే ఉండొచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చర్చించి నిర్ణయం తీసుకుంటాం

ఆర్డీఎస్ పంట సాగు విషయమై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని ఇరిగేషన్ కార్యాలయంలో ఉన్నతస్థాయి అధికారుల సమావేశం ఉంటుంది. సమావేశ అనంతరం ప్రకటన చేస్తాం.

\- శ్రీనివాసరావు, ఆర్డీఎస్ ఈఈ

నామినేషన్‌కు అడ్డంకులు

- అభ్యర్థికి బెదిరింపులు, అధికారులకు ఫిర్యాదు
- దగ్గరుండి వేయించిన తహసీల్దార్, ఎంపీడీవో

7

పాత బకాయిలపై మాజీల చింత!

- జడ్చర్ల మండలంలో సర్పంచులు, కార్యదర్శులకు రూ. 3.75 కోట్లు పెండింగ్

7

పాలమూరులో తట్ట మన్ను తీయలే

\- ముఖ్యమంత్రిపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శ

6

టెండర్ ఓటు నమోదైతే చర్యలు

\- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

మదనాపురం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టెండర్ ఓటు నమోదైతే అధికారులపై చర్యలు తీసుకుంటామని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. సోమవారం వనపర్తి జిల్లా మదనాపురం జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి ఓటును ఇతరులు వేస్తే అసలైన ఓటర్ ఓటు వేయడానికి అవకాశం ఉండదు. దీంతో అతను టెండర్ ఓటు వేయాల్సి ఉంటుంది. కావునా అధికారులు ఓటు వేయడానికి వచ్చినప్పుడు ఐడీ కార్డులను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. పోలింగ్ బాక్స్‌లకు సీల్ వేసేటప్పుడు, ఓపెన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్, ఎంపీడీవో ప్రసన్నకుమారి, శిక్షణ సిబ్బంది ఉన్నారు.

అన్ని స్థానాలూ ఏకగ్రీవం

- ప్రభుత్వ ప్రోత్సాహకమే లక్ష్యం
- తీర్మానం చేసుకున్న నారాయణపల్లి గ్రామస్థులు

7

రెండో రోజూ.. అదే జోరు

- గద్వాల జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 127 నామినేషన్లు..
- వనపర్తి జిల్లాలో సర్పంచ్ స్థానానికి 204 నామినేషన్లు దాఖలు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో సర్పంచు 324, వార్డులకు 983 నామినేషన్లు



వనపర్తి జిల్లా సవాయిగూడెంలో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న అభ్యర్థి

గద్వాల/ వనపర్తి/ నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) రెండో రోజూ.. జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో నామినేషన్ల జోరు కొనసాగింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండో విడత నామినేషన్లు రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 127 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మల్దకల్, అయిజ, వడ్డేపల్లి, రాజోలి మండలాల్లోని 74గ్రామ పంచాయతీలకు, 716 వార్డులకు అధికారులు నామినేషన్లు స్వీకరించారు. ఇందులో మల్దకల్ మండలంలో సర్పంచుకు 46, వార్డు సభ్యులకు 81నామినేషన్లు దాఖలు అయ్యాయి. అయిజ మండలంలో సర్పంచులకు 47, వార్డు సభ్యులకు 82, వడ్డేపల్లి మండలంలో సర్పంచులకు 12, వార్డు సభ్యులకు 36, రాజోలి మండలంలో సర్పంచులకు 22, వార్డు సభ్యులకు 46 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మొత్తం నాలుగు మండలాల్లో సర్పంచులకు 127, వార్డు సభ్యులకు 245 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను కలెక్టర్ బీఎం సంతోష్ అదనపు కలెక్టర్ నర్సింగరావు పర్యవేక్షించారు.

వనపర్తి జిల్లాలోని ఐదు మండలాల్లో రెండో రోజు సర్పంచ్ స్థానానికి 204, వార్డు సభ్యులకు 399 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండో రోజు 324 సర్పంచు, 983 వార్డు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో రెండో విడతలో ఇప్పటికీ మొత్తం సర్పంచు 427 నామినేషన్లు, 1078 వార్డు నామినేషన్ల వచ్చాయి. నేటితో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో.. రెండో విడత రెండో రోజు నామినేషన్లు ఇలా..

మండలం	గ్రామం	సర్పంచు	వార్డు
మల్దకల్	25	46	81
అయిజ	28	47	82
వడ్డేపల్లి	10	12	36
రాజోలి	11	22	46
మొత్తం	74	127	245

ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టాలి

\- వ్యాధి నివారణపై అధికారులు అవగాహన కల్పించాలి

\- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



ఉత్తమ డాక్టర్‌గా ఎంపికైన సృజనకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టాలని, ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతపర్చాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎయిడ్స్ నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని తెలిపారు. ఈ వ్యాధిపై జిల్లా స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. తదనంతరం హెచ్ఐవీ, ఎయిడ్స్ కార్యక్రమంలో సేవలు అందించిన జిల్లా, నియోజకవర్గ ఆసుపత్రుల సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ స్నూల్, గైనకాలజిస్టు డాక్టర్లకు, వైద్యాధికారులకు, నర్సింగ్ ఆఫీసర్లకు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డీసీహెచ్ఎస్ ఉన్నారు.

గుర్రంగడ్డకు తాత్కాలిక రోడ్డు

7

- ఎమ్మెల్యే హామీతో పనులు ప్రారంభించిన గ్రామస్థులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 130.00
హోల్ సేల్	: 139.00
డ్రెస్డ్	: 234.00
స్కిన్ లెస్	: 251.00

ఊరింపులేనా..?

- ఐదేళ్లైనా అసంపూర్తిగానే పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కలను సాకారం చేస్తామని గత ప్రభుత్వం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదలకు అందని ద్రాక్షగా మారాయి. ఐదేళ్ల క్రితం చేపట్టిన పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. డబుల్ బెడ్‌రూం వస్తుందని ఊరిస్తూనే నాయకులు పబ్బం గడుపుతున్నారు తప్ప ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయించలేకపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆరు బ్లాకుల్లో 192 ఇళ్లు

జిల్లా కేంద్రంలోని బస్ డిపో సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగానే వదిలేశారు. ఐదేళ్ల క్రితం ఒక్కో బ్లాకులో 32 ఇళ్ల చొప్పున ఆరు బ్లాకుల్లో మొత్తం 192 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలకు గ్లాస్ ఫిటింగ్, విద్యుత్ వైరింగ్, పేయింటింగ్ పనులు చేయకుండానే వదిలేశారు. గత పాలకులు ఇప్పుడు.. అప్పుడు అంటూ ఊరించారని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యంలోనైనా తమ సొంతింటి కల నెరవేరుతుందని భావిస్తే ఈ ప్రభుత్వంలో కూడా ఊరింపులే ఉన్నట్లుందని నిరుపేదలు వాపోతున్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించడంతో ఆశలు చిగురించాయి. కానీ నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో లబ్ధిదారులు నిరాశలో ఉన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పెండింగ్ పనులను పూర్తి చేసి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలని అభిప్రాయపడుతున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అసంపూర్తిగా డబుల్ బెడ్రూం ఇళ్లు



ఇరుముడితో ఆలయ ప్రాంగణంలో కూర్చున్న మాలధారణ స్వాములు

పాహిమాం.. పబ్బతి హనుమా...

» కొనసాగుతున్న అంజన్న బ్రహ్మోత్సవాలు

పదర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాహిమాం...పబ్బతి హనుమా అంటూ మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి చెంతకు మాలాధారణ స్వాములు ఇరుముడితో కుటుంబ సమేతంగా చేరుకుంటున్నారు. రెండవ రోజు కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ సన్నిధిలో జరుగుతున్న ప్రత్యేకపూజల కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సోమవారం ఉదయం ఆలయ అర్చకులతో పాటు, టీటీడీ నుంచి వచ్చిన రుత్వికులచే విఘేశ్వర, పంచగవ్యం, వాస్తుపూజలు జరిపారు. మూల మంత్ర, రుద్ర హోమాలు, నిత్యోపాసన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వితరణ కొనసాగింది. సాయంత్రం మన్యుసూక్త, చండీహోమం, బలిహరణ తీర్థప్రసాద వితరణ అనంతరం రాత్రి సమయంలో భక్తజనం సమక్షంలో అశ్వవాహన సేవతో ఆలయ ప్రాగణంలో ప్రదక్షిణలు చేశారు. బ్రహ్మోత్సవాలకు అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, పదర ఎస్ఐ శ్రీను సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నారు. పదర పీహెచ్‌సీ సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు.

నేటి కార్యక్రమాలు...

మంగళవారం ఉదయం విఘ్నేశ్వర, గవ్యాంతర, మాలమంత్ర, రుద్ర, మన్యూసూక్త హోమాలు, బలిహరణ తీర్థప్రసాద వితరణ, హనుమత్ వ్రతం, రాత్రి సమయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం, మంగళహారతి గజవాహన సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



భక్తులు తయారుచేస్తున్న మలీద నైవేద్యం



ఇరుముడితో ఆలయానికి చేరుకున్న దీక్షాస్వామి(కన్నెస్వామి)

చంద్రప్రభ వాహనంపై దేవదేవుడి ఊరేగింపు

» భారీగా తరలివచ్చిన భక్తులు

మల్దకల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో బాగంగా సోమవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై దేవదేవుడి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్దకల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోదా విష్ణు పరివార్ కర్నూల్ గోకులం వారిచే ఏర్పాటు చేసిన విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధికంగా హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ జగదీశ్వర్‌రెడ్డి ప్రవచనాలు చేశారు. సాయంత్రం దేవాలయ అధికారులు ఏర్పాటు చేసిన లలిత సంగీతం పలువురిని అలరించింది.

మయూర, హనుమత్ వాహనాలపై ఊరేగింపు

సాయంత్రం దేవాలయంలో సోమవారం బలిహరణ కార్యక్రమంతో పాటు అనేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను మయూర వాహనం అనంతరం హనుమత్ వాహనాలపై పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. వీధులలో కనుల పండవగా దర్శనమిచ్చిన ఉత్సవ మూర్తులను భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, స్వామివారి కల్యాణం మం గళవారం రాత్రి వైభవంగా కొనసాగనున్నది. కల్యాణోత్సవానికి హంపి పీఠాదిపతులు విద్యారణ్యభారతి స్వామి హాజరుకానున్నారని ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు.



బ్రహ్మోత్సవాలలో భాగంగా చంద్రప్రభ వాహనంపై దేవదేవుడి ఊరేగింపు

పాలమూరులో తట్ట మన్ను తీయలే

» సీఎంపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శ

వనపర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఉమ్మడి పాలమూరు జిల్లాలో తట్ట మన్ను కూడా తీయలేదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మక్తల్ బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఒక ప్రకటనలో పైవిధంగా స్పందించారు. చూసుకొని మురవ, చెప్పుకుని ఏడ్వ అన్నట్లుంది పాలమూరు పరిస్థితి అని ఎద్దేవా చేశారు. పేరుకే పాలమూరు బిడ్డనని చెప్పుకోవడం తప్పా రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా చేసింది ఏం లేదు అని, మాటలు కోటలు దాటుతున్నాయి తప్పా ఒక్క పని కూడా చేసింది లేదన్నారు. శంకుస్థాపనలు తప్పా రెండేళ్లలో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూళ్ల నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల గురించి అబద్దాలు చెప్పడానికి కొంచెం అయినా సిగ్గు ఉండాలన్నారు. పదేళ్లలో కేసీఆర్ హయాంలో అప్పు కేవలం రూ.3.48 లక్షల కోట్లతో చేసిన అభివృద్ధి, గణాంకాలు కండ్ల ముందు ఉన్నాయన్నారు. అయితే, కేవలం ఈ రెండేళ్లలో కార్పోరేషన్ రుణాలు కాకుండానే రూ.2.50 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. కూట్ల రాయి తీయలేనోడు... ఏట్ల రాయి తీస్తా అన్నాడట... కొడంగల్ సభలో రేవంత్ 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అని చెప్పడం... హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పంచాయతీలను రెండేళ్ల పాలనతో భ్ర ష్టు పట్టించిన రేవంత్ అభివృద్ధి గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించిన ట్లుగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయిలో భగవత్ గీత పోటీల్లో రెండవ బహుమతి

మరికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బజరంగ్ దళ్-విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి భగవత్ గీతా కంఠస్థ పోటీల్లో నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని శ్రీవాణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో కృష్ణవేణి రెండవ స్థానంలో నిలవడం మరికల్ మండల కేంద్రానికి గర్వ కారణమని పాఠశాల యాజమాన్యం పూర్ణిమ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వినీతమ్మ తెలిపారు. వీరితో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న శ్రీవాణి పాఠశాల యాజమాన్యం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మక్తల్ విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మక్తల్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో నవంబర్ 30న జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మక్తల్ పట్టణానికి చెందిన రేడియంట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ బాల్‌రాజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు అంకిత, ఆరాధ్య, అర్చనలను సన్మానించి అభినందించారు. డిసెంబర్‌లో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. పీఈటీ స్వాతి, పీడీ భీంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బయల్దేరిన కబడ్డీ జట్టు



రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుతో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ప్రిన్సిపాల్

కల్వకుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలోని హాలియాలో జరుగుతున్న 51వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా బాలికల కబడ్డీ జట్టు పాల్గొనేందుకు సోమవారం బయల్దేరినట్లు కబడ్డీ జిల్లా అధ్యక్షుడు ఎం.జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.యాదయ్యగౌడ్‌లు తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు పేరు తీసుకురావాలని, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాలని వారు తెలిపారు. గత వారం రోజుల నుంచి ఎంజేపీ జూనియర్ కళాశాల కల్వకుర్తి మైదానంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి క్రీడాకారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. క్రీడాకారులకు లాస ఫ్యూచర్ సిటీ ప్రతినిధి సునీల్ యాదవ్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ యామిని, హైస్కూల్ ప్రిన్సిపాల్ నాగమణి, జిల్లా అసోసియేషన్ సభ్యులు రమేష్, మోహన్‌లాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్, శ్రీనివాసులు, బాలశ్రీ, లలిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని స్టేడియం మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-19 హ్యాండ్ బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డాక్టర్ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రేమిస్తే ప్రాణం.. మోసం చేస్తే పాతాళం

(5వ పేజీ తరువాయి)

ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లలో దండుకట్టి దగ్గరుండి పూర్తి చేయించుకునే బాధ్యత ఈ ప్రాంత యువతదేని తెలిపారు.

అందరం జట్టుగా పని చేయాలి

75 ఏళ్ల తర్వాత ఈ ప్రాంత బిడ్డ సీఎం అయ్యారని, వడ్డించే వాడు మీ బిడ్డనే అయినందున ఎక్కడ కూర్చున్నా వడ్డించే బాధ్యత తనదేనని సీఎం అన్నారు. ఇదే కాదు పాలమూరు- రంగారెడ్డికి నిధులు ఇస్తున్నామని, ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచన మేరకు ఇస్తున్నామని తెలిపారు. కుట్ర చేసేటోళ్లు, నల్లికుంట్లలో ఉంటారని, ఇప్పుడు కాకపోతే మనం ఎప్పుడూ పనులు చేసుకోలేమని తెలిపారు. అందుకే అందరం జట్టుగా ఉండి పనిచేయాలని సూచించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బాసరలో ట్రిపుల్ ఐటీ ఉందని, ఈ ప్రాంతలో లేక బిడ్డలు ఇబ్బందులు పడుతున్నారంటే మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ తెచ్చామన్నారు. అలాగే పాలమూరు యూనివర్సిటీకికి ఇంజనీరింగ్, లా కాలేజీ తెచ్చామన్నారు. నియోజకవర్గానికో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేసుకున్నామని అన్నారు. సభలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూధన్‌రెడ్డి, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సంజీవ్ ముదిరాజ్, రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఎం సభా వేదికపై మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యేల మాటామంతి



ముఖ్యమంత్రి, ఇతర మంత్రులకు స్వాగతం పలుకుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

మహిళలకు రూ.25వేల కోట్ల వడ్డీలేని రుణాలు

» రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



మహిళా సాధికారత కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తూ కోటీ మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మహిళలకు రూ.25 వేల కోట్లతో వడ్డీలేని రుణాలు అందించి, రూ.1300 కోట్ల వడ్డీ అందించిన చరిత్ర రేవంత్‌రెడ్డిది అన్నారు. నైపుణ్యంతో కూడిన విద్య, టూరిజం అభివృద్ధి అన్నికోణాల్లో ఆలోచన చేసే ధైర్య నాయత్వం రేవంత్‌కు ఉందన్నారు.

రూ.128 కోట్లతో రవాణా సౌకర్యం కల్పించాం: మంత్రి కోమటి రెడ్డి



పదేళ్లుగా పాలించిన పాలకులు రోడ్డు సౌకర్యం కల్పించని గ్రామాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.128 కోట్లతో రవాణా సౌకర్యం కల్పించిందని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రూ.8 వేల కోట్లతో మన్ననూర్ శ్రీశైలం రోడ్డు, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, బల్లెట్ ట్రైన్ సదుపాయలు కల్పించనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ అప్పులతో రాష్ట్రాన్ని అప్పగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధిగమించి, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇంకా ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

పాలమూరు దుస్థితిని పట్టించుకోలేదు: మంత్రి జూపల్లి



మక్తల్, నారాయణపేట, కొడంగల్ పూర్తిగా వెనుకబడిన ప్రాంతాలతో పాటు పాలమూరు దుస్థితిని గత పాలకులు పట్టించుకోలేదని మంత్రి జూపల్లి కృష్ణరావు విమర్శించారు. ఈ ప్రాంతాలకు సాగునీటితో పాటు మక్తల్ ప్రాంత అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వాస్తవాలను అవాస్తవాలుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ రెండేళ్ల పాలనకు రెఫరెండం అన్న కేటీఆర్ ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటాడని ప్రశ్నించారు. ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ విజయం తథ్యం అన్నారు.

అపరభగీరథుడు సీఎం రేవంత్‌రెడ్డి: మంత్రి వాకిటి శ్రీహరి



మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి, రూ.5 వేల కోట్లతో లక్షా 25 వేల ఎకరాలను సస్యశ్యామలం చేసేందుకు చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేంవత్‌రెడ్డి అపరభగీరథుడని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్-పేట-కోడంగల్ ఎత్తిపోతల పథకంగా పేరు పేరు మార్చేందుఉకు సీఎం ఒక్క క్షణం కూడా ఆలోచించలేదన్నారు. సీఎంకు ఈ ప్రాంత రైతాంగం రుణపడి ఉంటుందన్నారు. ఎక్కడలేని విధంగా పరిహారం ఇచ్చి ఆదుకున్న మహనీయుడలన్నారు. సహచర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణరావులకు నిధులు ఇవ్వడం పట్ల ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారన్నారు.

ఓట్ల కోసం నాయకుల ఆరాటం పొట్టకూటికి మహిళల పోరాటం

» సీఎం సభలో తారసపడిన దృశ్యాలు

» పల్లీలు అమ్మేందుకు వచ్చిన సుదూర ప్రాంతాల మహిళలు



సభా వేదిక వద్ద పల్లీలు అమ్ముతున్న మహబూబాబాద్ జిల్లా వాసి

ఊట్కూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క రాజకీయ నాయకుల ఓట్ల కోసం ఆరాటపడుతుండగా, మ రోపక్క పొట్టకూటి కోసం పల్లీలు అమ్ముతూ కొందరు మహిళలు తారసపడ్డారు. ఇది సీఎం సభ సందర్భంగా కనిపించిన దృశ్యాలు. ప్రజా ప్రనిధులు, రాజకీయ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ప్రసంగం చేస్తుండగా అదే వేదిక బయట మహిళలు బతుకు దెరువు కోసం సుదూర ప్రాంతం నుంచి వచ్చి పల్లీలు అమ్ముతూ కనిపించారు. ఆ మహిళలను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. అందులో ఒకామె మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన కౌసల్య. ఆమె మాటల్లో.. ఈ సభలో పల్లీలు అమ్మడానికి ఆదివారం బయలుదేరి రైల్‌లో సోమవారం ఉదయం మక్తల్‌కు చేరుకున్నాను. వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 15 మందితో ఆత్మకూర్, మక్తల్ సభల్లో పల్లీలు అమ్మ డానికి వచ్చాను. ట్రైన్‌లో అయినా, సభలో అయినా సాధారణం గా పల్లీలు అమ్మితే రెండు వేలు రాగా, రూ.వెయ్యి ఖర్చులు పోను మరో వెయ్యి మిగులుతుందన్నారు. సభలో జనాలు ఎక్కువ వస్తారు.. టైం పాస్ కోసం, పల్లీలు తీసుకుంటారు.. అందుకే అంత దూరమైనా సభలకు వస్తామని చెప్పుకొచ్చారు.

38 నిమిషాల్లో ముగిసిన ముఖ్యమంత్రి పర్యటన

వనపర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన 38 నిమిషాల్లో ముగిసింది. 2:26 నిమి షాలకు హెలిప్యాడ్‌లో జాతర మైదానానికి చేరుకు న్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా 2:38కి గాంధీ చౌక్‌కు చేరుకున్నారు. అక్కడ పట్టణ నాయకులు గజమాల తో సన్మానించారు. 2.43కి పీజేపీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. రూ.122.90 కోట్లతో ఆత్మకూరు మండలంలో వంతెన నిర్మాణ పనులకు, రూ.15 కోట్ల వ్యయంతో ఆత్మ కూరు నగర అభివృద్ధికి, మరో రూ.15 కోట్ల వ్యయంతో అమరచింత నగర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశా రు. అలాగే ఆత్మకూరు మునిసిపాలిటీలో రూ.22 కోట్ల వ్యయంతో 50 పడకల సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా 2:48 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. 3 గంటలకు మక్తల్‌లోని బహిరంగ సభకు వెళ్లారు.

ముఖ్య మంత్రి హోదాలో తొలిసారి ఆత్మకూరు రావడంతో అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎస్పీ సునీత ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఆత్మకూరులో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం

నారాయణపేట/మక్తల్, (ఆంధ్రజ్యోతి): మక్తల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రూ.1,000 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణరావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలతో కలిసి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని జూరాల, కొత్తపల్లి గ్రామాల మధ్య కృష్ణానదిపై రూ.123 కోట్లతో బ్రిడ్జి, మక్తల్‌లో రూ. 25 కోట్లతో క్రీడా మైదానం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, మునిసిపాటిలో రూ.15 కోట్లతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. మక్తల్‌లో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, మక్తల్-నారాయణపేట మధ్య రూ.210 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు, రూ.25 కోట్లతో సీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, మినీ స్టేడియం, రూ.3.50 కోట్లతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం తదితర పనులను ప్రారంభించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కుంభం శివకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన సైడ్‌లైట్స్

ఊట్కూర్ (ఆంధ్రజ్యోతి): మక్తల్‌లో సభ వేదికకు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు సీఎం రేవంత్‌రెడ్డి హెలిక్యాప్టర్‌లో మధ్యాహ్నం 3:17 గంటలకు వచ్చారు.

- 3.30 గంటలకు పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రులతో కలిసి పూజలు చేసి, ఆశీర్వాదం తీసుకున్నారు.
- 3.47 గంటలకు తెలంగాణ గీతం ఆలపించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జన సమీకరణ తక్కువగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.
- సీఎం మాట్లాడుతుండగా సభకు వచ్చిన వారు కేరింతలు కొట్టారు.
- ఎంఎన్‌కే ప్రాజెక్టు నిర్వాసితులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇస్తున్నందుకు నిర్వాసితులు ప్లకార్డులతో సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

పడమటి అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజ నర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఆలయ ప్రాశస్తిని వివరించారు. ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకర్, రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పూజలు చేసిన వారిలో ఉన్నారు.

ప్రశాంతంగా పర్యటన

మక్తల్‌లో నిర్వహించిన ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు గట్టి బందోబస్తు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ డాక్టర్ వినీత్ పర్యవేక్షించారు. పోలీసులకు సూచనలు ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తును స్వయంగా పరిశీలించారు. దీంతో సీఎం పర్యటన సజావుగా సాగింది.



పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో పట్టు వస్త్రాలతో సీఎం రేవంత్‌రెడ్డి

మంత్రి శ్రీహరి అసహనం

మక్తల్, (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆశీర్వాదంతో రూ.1000 కోట్లు నియోజకవర్గ అభివృద్ధి కోసం మంజూరు చేయించుకున్నామని, కానీ జనం తక్కువగా వచ్చారని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి అధికంగా నిధులు మంజూరు చేయించినా.. స్వాగతం పలికేందుకు ప్రజలు తక్కువగా వచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జన సమీకరణలో విఫలం అయ్యారని పలువురు చర్చించుకున్నారు.



అభ్యర్థి జయమ్మతో తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు

నామినేషన్‌కు అడ్డంకులు

» అభ్యర్థికి బెదిరింపులు, అధికారులకు ఫిర్యాదు

» దగ్గరుండి వేయించిన తహసీల్దార్, ఎంపీడీవో

అయిజ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళా అభ్యర్థి నామినేషన్ వేయకుండా కొందరు బెదిరించి, అడ్డుకున్నారు. ఈ విషయంపై ఆమె అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారే దగ్గరుండి ఆమెతో నామినేషన్ వేయించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలోని ఉత్తనూరులో 1877 మంది ఓటర్లున్నారు. ఎస్సీ మహిళకు రిజర్వు అయిన ఈ గ్రామంలో 30 ఓట్లు ఉన్న 10 హోలియదాసరి కుటుంబాలు నివసిస్తున్నాయి. వారిలో జయమ్మ అనే మహిళ ఈనెల 30న భర్త రామలింగన్నతో కలిసి నామినేషన్ వేసేందుకు వెళ్లారు. అక్కడే ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఆమెను అడ్డుకున్నారు. తమ సామాజిక వర్గానికి 300 ఓట్లు ఉన్నాయని, మేమే నామినేషన్ వేసుకుంటామని చెప్పారు. అంతే కాకుండా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరించారు. ఈ విషయాన్ని జయమ్మ, రామలింగన్నలు మీడియాకు వెల్లడించారు. అధికారులు సహకరించాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో భాస్కర్, పోలీసు అధికారులు సోమవారం ఉత్తనూరు గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. దగ్గరుండి ఆమెతో నామినేషన్ వేయించారు.

పాత బకాయిలపై మాజీల చింత!

» జడ్చర్ల మండలంలో సర్పంచులు, కార్యదర్శులకు రూ. 3.75 కోట్లు పెండింగ్



జడ్చర్ల మండలంలోని దేవునిగుట్ట తండాలో నిర్మించిన వాటర్ ట్యాంకు

జడ్చర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి కొనసాగుతుండగా, తమకు రావాల్సిన బకాయిలపై మాజీ సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. తాము గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డుల నిర్మాణానికి ఖర్చు చేసిన డబ్బులు మంజూరు కాక ఆవేదనకు గురవుతున్నారు. చేసిన పనులకు సంబంధించి ఎంబీ రికార్డు అయ్యిందని, ఆ బిల్లుల కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నామని వారు చెప్తున్నారు.

అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు

తాను అప్పు తెచ్చి గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశామని, తనకు ప్రభుత్వం నుంచి దాదాపు రూ. 40 లక్షలు రావాల్సి ఉందని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు దాదాపు రూ. 20 లక్షలు రావాల్సి ఉందంటూ మరో మాజీ సర్పంచ్ వాపోయాడు. జడ్చర్ల మండలంలోని దేవునిగుట్ట పంచాయతీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రూ. 22.50 లక్షలు రావాలసి ఉందని మాజీ సర్పంచు రామూనాయక్ తెలిపారు. ఇలా జడ్చర్ల మండలంలోని మొత్తం45 గ్రామ పంచాయతీలలో రూ. 2,12,70,440 బకాయిలు రావలసి ఉందని, ఎంబీ రికార్డు కూడా నమోదయ్యిందని మండల ప్రజా పరిషత్ అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా గడిచిన రెండు సంవత్సరాల్లో గ్రామ పంచాయతీల్లో పలు పను లకు తమ సొంత డబ్బు ఖర్చు చేశామని, ఆ బిల్లులు ఇప్పటివరకు రాలేదని కార్యదర్శులు చెప్తు న్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు రూ. 1.65 కోట్లు రావాల్సి ఉండగా, ఎంబీ రికార్డు అయ్యిందని అధికారులు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత వచ్చే పాలకులకు తమకు సంబంధించిన బిల్లులను మంజూరు చేయకపోతే తమ పరిస్థితి ఏమిటని దిగులు పడుతున్నారు.






అంగన్‌వాడీ టీచర్ నామినేషన్

» అంతకుముందే ఉద్యోగానికి రాజీనామా



అభ్యర్థి నీరజతో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు

కొత్తకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో ఓ అంగన్‌వాడీ టీచర్ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశారు. కొత్తకోట మండలంలోని పాలెం ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యింది. అదే గ్రామంలోని అంగన్‌వాడీ 3వ కేంద్రంలో టీచర్‌గా పని చేస్తున్న నీరజ ఉద్యోగానికి రాజీనామా చేసి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయోజ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆమతో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయించారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, మిషేక్, జేసీబీ రాము, వెంకటన్నగౌడ్, సుభాష్ ప్రసాద్, నారాయణ ఉన్నారు.



వార్డు మెంబర్ అభ్యర్థులకు కేటాయించిన కొన్ని గుర్తులు

ఉంగరం, గౌను, జగ్గు..

» పంచాయతీ ఎన్నికలకు స్వతంత్ర గుర్తులు కేటాయించిన ఎన్నికల కమిషన్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ స్వతంత్ర గుర్తులను కేటాయించింది. సర్పంచు అభ్యర్థులకు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను విడుదల చేసింది. అభ్యర్థుల పేర్ల ఆధారంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఆ గుర్తులను కేటాయిస్తారు.

సర్పంచు అభ్యర్థులకు..

1. ఉంగరం, 2. కత్తెర. 3. బ్యాట్, 4. టీకప్పు, 5. విమానం, 6. ఫుట్‌బాల్, 7. షటిల్ కాక్. 8. కుర్చీ, 9. పంకా, 10. బ్లాక్‌బోర్డు, 11. బెండకాయ, 12. కొబ్బరితోట, 13. వజ్రం, 14. బకెట్, 15. డోర్ హ్యాండిల్, 16. టీ జల్లెడ, 17. చేతికర్ర, 18. మంచం, 19. పడక, 20. టేబుల్‌తో పాటు నోటా గుర్తును గులాబీ (పింక్) బ్యాలెట్ పేపర్‌లో గుర్తించనున్నారు.

వార్డు స్థానాలకు..

1. జగ్, 2. గౌను, 3. స్టౌవ్. 4. స్టూల్, 5. సిలిండర్, 6. టీ కప్పు, 7. బీరువా, 8. కుండ, 9. డిష్ యాంటినా, 10. గడియారంలతో పాటు నోటా గుర్తులను కేటాయించారు. బ్యాలెట్ పేపర్ తెలుపు (వైట్) రంగులో ఉంటుంది.

అక్షర క్రమంలో కేటాయింపు



వెంకట్ రెడ్డి, ఇన్‌చార్జి డీపీవో : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచు, వార్డు సభ్యుల స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ గుర్తులను సూచించింది. అభ్యర్థులు నామినేషన్ పత్రంలో రాసిన తమ పేరు ఆధారంగా అక్షర క్రమంలో వాటిని కేటాయిస్తాం.

ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే..

వారే సర్పంచు

» రూ. 16 లక్షలు ఇస్తామన్న వ్యక్తికి పదవి

» తిమ్మరెడ్డిపల్లి తండా వాసుల తీర్మానం



మోహన్‌నాయక్

ఊట్కూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారే సర్పంచ్ పదవిని చేపట్టాలని గ్రామ పెద్దలు స్పష్టం చేశారు. అందుకు ఇద్దరు పోటీ పడగా, ఎక్కువ డబ్బులు ఇస్తామని చెప్పిన వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్థులు తీర్మానం చేసుకున్నారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని తిమ్మరెడ్డిపల్లి తండాలో జరిగింది. ఆ పంచాయతీలో 8 వార్డులు ఉండగా, 492 మంది ఓటర్లు ఉన్నారు. సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్థులు సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామంలో శివాలయం నిర్మాణానికి ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే సర్పంచు పదవి అని గ్రామ పెద్దలు స్పష్టం చేశారు. దీంతో గ్రామానికి చెందిన రమేశ్‌నాయక్ రూ. 15 లక్షలు ఇస్తామని చెప్పాడు. కాంగ్రెస్ నాయకుడు మోహన్ నాయక్ రూ. 16 లక్షలు ఇస్తామని ప్రకటించడంతో ఆయనను సర్పంచుగా ఎంపిక చేసుకుందామని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

అన్ని స్థానాలూ ఏకగ్రీవం

» ప్రభుత్వ ప్రోత్సాహకమే లక్ష్యం

» తీర్మానం చేసుకున్న నారాయణపల్లి గ్రామస్థులు



బారివాములయాదవ్

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని నారాయణపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పాకనాటి బారివాముల యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే 8 వార్డులకు కూడా అభ్యర్థులను కూడా నిర్ణయించుకున్నారు. గ్రామస్థులు సోమవారం స్థానిక దేవాల యంలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ మేరకు తీర్మానం చేసుకున్నారు. ఏకగ్రీవమైతే ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఇచ్చే రూ.10 లక్షలతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే శివాలయం అభివృద్ధికి సహకరిస్తామని యాదవ్ చెప్పడంతో ఈ మేరకు వారు తీర్మానం చేసుకున్నారు. నారాయణపల్లి 1995లో గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. గత ఎన్నికల్లోనూ సర్పంచుగా నలవాల కమ్మలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి మృత్యువాత



మహేశ్ (ఫైల్)

భూత్పూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృత్యువాత పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని కర్వెన రిజర్వాయర్ వద్ద ఆదివారం ఈ సంఘటన జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మూసాపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వేముల మహేశ్ (26) గత నెల 30న మరో ఇద్దరితో కలిసి చేపలు పట్టేందుకు కర్వెన రిజర్వాయర్ (15వ ప్యాకేజీ)కు వెళ్లాడు. అక్కడ చేపలు పడుతూ మహశ్ ప్రమాదవశాత్తు కాలు జారి రిజర్వాయర్‌లో పడిపోయాడు. తోటి వారు వెంటనే గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. అతడి మృతదేహం సోమవారం నీటిపై తేలడంతో స్థానికుల సహకారంతో బయటకు తీశాడు. సమాచారం అందుకున్న జడ్చర్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మహేశ్‌కు భార్య అశ్విని ఉంది. పెళ్లయి ఏడాది గడవక ముందే అతడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

» 11 లీటర్ల మద్యం స్వాధీనం

ఎర్రవల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండలంలోని కొండేరులో ఓ బెల్టుషాపుపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఇటిక్యాల ఎస్‌ఐ రవినాయక్, సిబ్బందితో కలిసి దుకాణాన్ని తనిఖీ చేశారు. రూ. 5,280 విలువైన 11.33 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

12 మంది బైండోవర్

మానవపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నిక నేపథ్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలో 12 మందిని బైండోవర్ చేయించినట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. లక్ష రూపాయల సొంత పూచీకత్తుగా పత్రాలపై సంతకాలు చేయించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైండోవర్ అయినవారిలో మానవపాడు, అమరవాయి, కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలకు చెందిన వారున్నారని ఎస్‌ఐ తెలిపారు.

150 గ్రాముల గంజాయి పట్టివేత



పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

గద్వాల క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, చిన్నచింతరేవుల ఎక్స్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి నుంచి 150 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన అవీజ్ అనే వ్యక్తి తన బైక్‌పై 150 గ్రాముల గంజాయిని తీసుకొస్తుండగా ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి, ఎస్‌ఐలు వెంకటేశ్, వీరేశలింగం, శివకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

మూసాపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆటో అదుపుతప్పి ఇద్దరు గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల మండలంలోని పెద్దమునగాల్‌చెడ్‌కు చెందిన శివ, గుడిబండకు చెందిన నర్సింహలు సోమవారం ఆటోలో హైదరాబాద్‌కు బయలుదేరారు. జానంపేట వద్ద ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్రంగడ్డకు తాత్కాలిక రోడ్డు

» ఎమ్మెల్యే హామీతో పనులు ప్రారంభించిన గ్రామస్థులు

గద్వాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) జోగుళాంబ గద్వాల జిల్లాలో కృష్ణానది మధ్యన ఉండే దీవి గ్రామం గుర్రంగడ్డకు తాత్కాలిక రోడ్డు పనులను గ్రామస్థులు సోమవారం ప్రారంభించారు. నదికి వరద తగ్గినా కాంట్రాక్టర్ ఇప్పటి వరకు బ్రిడ్జి పనులను చేపట్టలేదు. గత ఏడాది వేసిన తాత్కాలిక రహదారి వరదలలో కొట్టుకు పోయింది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం గ్రామంలోనే ఉండిపోయింది.

తాత్కాలిక రోడ్డు వేస్తేనే ధాన్యాన్ని బయటకు తీసుకెళ్లడం, రబీకి సంబంధించిన ఎరువులు, విత్తనాలను తీసుకొచ్చుకోవడం సాధ్యం అవుతుంది. అందుకోసం గ్రామ స్థులు గత సోమవారం 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. రోడ్డు నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరారు. కానీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారులు హామీ ఇవ్వలేకపోయారు. ఈ విషయంపై గత నెల 26న 'నిధులు ఇవ్వండి - రోడ్డు నిర్మించుకుంటాం' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. దీంతో పాటు పరిస్థితిని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. మీరే రోడ్డు నిర్మించుకోండి, ఎన్నికల తర్వాత అధికారులతో మాట్లాడి నిధులు విడుదలయ్యేలా చూద్దామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు సోమవారం తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. రెండు రోజు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అయితే ప్రతీ సంవత్సరం ఇదే సమస్య తలెత్తుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.



ఎక్స్‌కవేటర్‌తో ప్రారంభమైన తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులు

విచ్చలవిడిగా పెరిగిన శ్రమదోపిడీ

» సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి » ముగిసిన యూనియన్ జిల్లా మహాసభలు

గద్వాల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో శ్రమదోపిడీ విచ్చలవిడిగా పెరిగిపోయిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా మూడవ మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జయలక్ష్మి మాట్లాడుతూ విధానాల అమలులో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఏ మాత్రం తేడా లేదని, అందరిదీ ఒకే బాట అని విమర్శించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాస్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం సీఐటీయూ చేస్తున్న పోరాటాలకు తమ సంఘాలు మద్దతుగా ఉంటాయన్నారు. అనంతరం పలు అంశాలపై సభలో ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పేరు నరసింహ, కార్యదర్శిగా వివి నరసింహలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా గట్టన్న, ఉపాధ్యక్షులుగా ఎమేలమ్మ, వెంకటేశ్వర్లు, ఈశ్వర్, సహాయ కార్యదర్శులుగా సునీత, తిమ్మప్ప, రామకృష్ణ, కమిటీ సభ్యులుగా శాంతమ్మ, చెన్నమ్మ, లక్ష్మన్న, రంగారావు, నరేశ్, మద్దయ్య, శివ, బీచుపల్లి, సంజీవరాజు, జయాకర్, సీతారాం, పద్మ, రజాక్, సలోమి ఎన్నికయ్యారు.



వేదికపై సంఘీభావం తెలుపుతున్న నాయకులు

భయం వీడితేనే విజయం మీ సొంతం

- టీఏఎస్ఐ సీఈవో శ్రీకాంత్ సిన్హా

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భయం వీడితే విజయం సొతం అవు తుందని, తెలంగాణ అకడామిక్ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సీఈవో శ్రీకాంత్ సిన్హా అన్నారు. సోమవారం సాయంత్రం పాలమూరు నగరంలోని జయప్రకాష్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాల, టీసీఎస్ ఇయాన్ కంపెనీల మధ్య జాబ్ అచీవర్ ఎంవోయూ కుదుర్చుకున్నారు. కార్యక్రమాన్ని శ్రీకాంత్ సిన్హా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ఫండమెంటల్స్ సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి సారించాలన్నారు. కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ టీసీఎస్ కంపెనీతో జాబ్ అచీవార్ ఒప్పందాన్ని కుదుర్చుకున్న మొదటి కళాశాల ఇదే అన్నారు. ఇటీవల ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు కె భవిత, ఏ భార్గవి, మధులికలకు రూ. 50 వేల చెక్కులను అందించారు. టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు అర్జున్, సౌమ్య, హరికృష్ణ, అజయ్, ఇర్ఫాన్, టాస్క్ ప్రతినిధులు ప్రదీప్, సిరాజ్, సీనియర్ న్యాయవాది మనోహర్ రెడ్డి, కళాశాల వైస్ చైర్మన్ సీ భాస్కర్, కార్యదర్శి వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ పి. కృష్ణమూర్తి, డాక్టర్ చంద్రశేఖర్, కోటల సందీప్ కుమార్, సాయితేజ పాల్గొన్నారు.

రక్షణ బాధ్యతలకు సిద్ధంగా ఉండాలి

అత్యవసర సమయంలో దేశ రక్షణ బాధ్యతలు స్వీకరించడానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని పీయూ వీసీ డాక్టర్ జీఎన్ శ్రీనివాస్ సూచించారు. జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఎన్‌సీసీ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ గురు రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో శ్రీకాంత్ సిన్హా

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ

» చింతలముని స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

గట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలోని చాగదోణలో సోమవారం రాత్రి నల్లారెడ్డి చింతలమునిస్వామి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం దివంగత మాజీ సర్పంచ్ చాగదోణ శంకర్‌గౌడు కుమారుడు నవీన్ గౌడు జన్మదినం సందర్భంగా భజన నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త అభిలాష్, నిజాంకారి మురళి, రమేశ్‌గౌడ్, పురుషోత్తమ్‌గౌడ్, రుద్రగౌడు, మహేశ్‌గౌడ్, జితేందర్ గౌడ్, శేఖర్‌గౌడ్, ఉదయశేఖర్‌గౌడ్, హరిశ్చంద్రగౌడ్, శశిధర్‌గౌడు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

జడ్చర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి తోడు ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఎస్‌ఐ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు... మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన పోలె వరలక్ష్మి (35), చందు దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. వరలక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికి తోడు ఇటీవల ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో మనస్తాపానికి గురయ్యింది. భర్త చందు సోమవారం పనికి వెళ్లిన అనంతరం ఆమె గ్రామ సమీపంలోని నూరుకుంట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనపై ఆమె సోదరుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మస్తీపూర్ యువకుడి బలవన్మరణం

» హైదరాబాద్‌లో ఘటన

అమరచింత, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింత మండలంలోని మస్తీపూర్ గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన రాజశేఖర్ (26) కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఎస్‌ఆర్‌నగర్ ప్రాంతంలోని ఒక లాడ్జిలోని గదిలో రాజశేఖర్ ఆదివారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం సాయంత్రం గ్రామానికి తీసుకొచ్చి ఖననం చేశారు. అతడి తల్లిదండ్రులు 15 ఏళ్ల క్రితం మృతి చెందారు. సోదరికి వివాహం అయ్యింది. రాజశేఖర్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉన్నది.

న్యూస్ బాక్స్

గ్రామ పరిపాలన కమిటీ ఏర్పాటు

● అభినందించిన కేటీదొడ్డి తహసీల్దార్

ధరూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేటీదొడ్డి మండలం కాలూర్ తిమ్మన్‌దొడ్డి గ్రామంలో సోమవారం మండల గ్రామపాలన అధికారులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరికృష్ణ అధ్యక్షతన గ్రామ పరిపాలన అధికారుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాంచజన్య, కోశాధికారిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా వీరేందర్, కార్యవర్గసభ్యులుగా చింతరేవుల ఆంజనేయులు, కావాలి గోవర్ధన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన మండల కమిటీ సభ్యులను తహసీల్దార్ అభినందించారు.

స్టేషన్‌లో నగదు అప్పగింత

ధరూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాంపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్ సోమవారం గద్వాలకు వస్తున్న క్రమంలో ధరూర్ సమీపంలో గల పెట్రోల్ బంక్ దాడిన తర్వాత (నరసింహారెడ్డి తోటవద్ద) రోడ్డుపై రూ.3,200 నగదు దొరికింది. దీంతో ఆయన నగదును గద్వాల పట్టణ పోలీసులకు అప్పగించానని తెలిపారు. డబ్బులు పోగొట్టుకున్నవారు ఆధారాలతో గద్వాల టౌన్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించి తీసుకోవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

గద్వాలఅర్బన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27వ వార్డులో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు వడ్డేకృష్ణ కుమారుడు పవన్‌స్వామి ఆధ్వర్యంలో వారి స్వగృహంలో సోమవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ, భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ పడిపూజకు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామివారి మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు స్వీకరించి అయ్యప్పస్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కేశవ్ స్వామి మాట్లాడుతూ అయ్యప్పస్వామి మహా పడిపూజలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వడ్డేకృష్ణ కుటుంబ సభ్యులకు, గద్వాల ప్రజలకు అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, గోవింద స్వాములు, వార్డుప్రజలు, మహిళా భక్తులు ఉన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

గద్వాలలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం భిక్ష దాతలు రాధిక, మోహన్ రెడ్డి, ఐశ్వర్య, బసంత్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గురుస్వాములు, స్వాములు ఉన్నారు. ఈ సందర్భంగా వారు అన్నదాతలను అభినందించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

ఇటిక్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇటిక్యాల మండలం చాగాపురం గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి సంపత్‌కుమార్ సమక్షంలో చాగాపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింహులు, గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మారియో, ప్రకాశం, కృష్ణ, సామేల్, తిరుపాలు, తిమ్మప్ప, రాజేశ్, సుధాకర్, దేవన్న, యేబు, మనోహర్ ఉన్నారు.

సెల్‌ఫోన్ టవర్ నిర్మించవద్దని వినతి

● కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రాలు అందజేసిన బీసీ కాలనీవాసులు

గద్వాల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీలో సెల్‌ఫోన్ టవర్ నిర్మాణానికి అధికారులు అనుమతి ఇవ్వరాదని స్థానిక ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సవారన్న కోరారు. కాలనీవాసులతో కలిసి సోమవారం కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. టవర్ నిర్మాణం తలపెట్టిన ప్రదేశం పాఠశాలకు అత్యంత సమీపంలోనే ఉండటం వల్ల విద్యార్థులు రేడియేషన్ ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని, రకరకాల వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమీపంలోనే హనుమాన్ ఆలయం, పట్టణ ప్రకృతివనం కూడా ఉండటం వల్ల అక్కడి వచ్చే పోయే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుందని, టవర్ నిర్మాణం వల్ల పరిసరాల కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు.

మహిళల భద్రతకే షీ టీంల ఏర్పాటు : ఎస్పీ

గద్వాల క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలు, బాలికల రక్షణ కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని ఎస్పీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరులో షీ టీంల ఆధ్వర్యంలో 18 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 93 రద్దీ ప్రదేశాలను హాట్ స్పాట్ తనిఖీలు చేపట్టారని, ఎనిమిది ఫిర్యాదులు అందడంతో తక్షణమే స్పందించారని తెలిపారు. అలాగే ఎనిమిది పెటీ కేసుల్లో చర్యలు తీసుకున్నారని, మరో ఎనిమిది చోట్ల వేధింపులకు గురిచేస్తున్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని చర్యలు తీసుకున్నారని, కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించారని పేర్కొన్నారు. షీ టీం సహాయం అవసరమైన వారు సెల్‌నెంబర్ 8712670312ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల వ్యయం బ్యాంకు ఖాతా

నిర్వహణ పత్రాలు విధిగా అందజేయాలి

● కలెక్టర్ బీఎం సంతోష్
● మల్దకల్, తాటికుంట గ్రామాల్లో నామినేషన్ కేంద్రాల పరిశీలన
● నామినేషన్ వేసిన అభ్యర్థుల ఓటరు జాబితాపై ఆరా
● ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశం



మల్దకల్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

మల్దకల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేస్తున్న ప్రతీ అభ్యర్థికి విధిగా ఎన్నికల వ్యయముల ఖాతా నిర్వహణ పత్రాలను అందజేయాలని ఎన్నికల అధికారులకు జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. సోమవారం మల్దకల్ మండల కేంద్రంతో పాటు తాటికుంట గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం సంబంధిత అభ్యర్థుల నుంచి నామినేషన్ స్వీకరించాలని ఎన్నికల అధికారులకు సూచించారు. పోటీ చేయు అభ్యర్థుల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను తీసుకుని విధిగా దరఖాస్తులకు జత చేయాలని డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థితో నిర్దేశిత డిపాజిట్ తీసుకుని తగిన రసీదును అందజేయాలన్నారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే అనుమతించాలని సూచించారు. అభ్యర్థులు గ్రామ పంచాయతీకి చెల్లించవలసిన పన్నులు, బకాయి లేకుండా చూడాలని ఎన్నికల నియమావళి ఇతర అంశాలతో ముద్రించిన పత్రాలను అభ్యర్థులకు అందజేయాలన్నారు. అనంతరం అభ్యర్థులకు సంబంధించిన ఓటరు జాబితాను ఆయన పరిశీలించారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల జాబితాను నోటీస్ బోర్డుపై అతికించాలని ఆదేశించారు. సాయంత్రం 5 గంటల తర్వాత నామినేషన్ వేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని, నిర్దేశిత సమయానికి కేంద్రంలో ఉన్న వారి నుంచి మాత్రమే నామినేషన్ పత్రాలు స్వీకరించాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు మల్దకల్ మండల ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంఈవో సురేశ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించామని, నామినేషన్ల పరిశీలన కొనసాగుతుందని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీసు అధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని 2వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు జిల్లా, మండలస్థాయి అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. నిత్యం పర్యవేక్షిస్తున్నారని, ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను కేటాయించామని, పోలింగ్ కేంద్రాల దగ్గర వెబ్‌కాస్టింగ్, ఇతర ఏర్పాట్లు చేశామని వివరించారు.

సమావేశంలో ఎన్నికల సాధారణ జిల్లా పరిశీలకులు గంగాధర్, అడిషనల్ ఎస్పీ శంకర్, డీపీఓ శ్రీకాంత్, డిప్యూటీ సీఈవో నాగేంద్రం ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే సన్మానం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. సోమవారం గద్వాల మండలం కొత్తపల్లి నుంచి ఆత్మకూర్ వరకు జూరాల హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించినందుకు ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరికి గద్వాల నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బండ్ల వెంట సుభాన్, నాయకులు ఉన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు 5 వరకు గడువు

గద్వాల సర్కిల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనవరి/ఫిబ్రవరి 2026లో నిర్వహించే వివిధ ట్రేడ్స్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు ఈనెల 5వ తేదీ చివరి గడువు అని జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి, జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ టెక్నికల్ కోర్సుల పరీక్షలకు హాజరయ్యేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు బీఎస్ ఈ.తెలంగాణ వెబ్ సైట్ ద్వారా తమ ఫీజులను చెల్లించాలని సూచించారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ రూ.100, హయ్యర్ గ్రేడ్ రూ.150, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ రూ.150, హయ్యర్ గ్రేడ్‌కు రూ 200 చెల్లించాలని వివరించారు. రూ.50 ఆలస్య రుసుముతో ఈ నెల 12, రూ. 75 ఆలస్య రుసుముతో ఈనెల 19వ వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

ఫీజు చెల్లించిన దరఖాస్తులను ఈనెల 22 నుంచి 23వ తేదీలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విదేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు, అంతర్జాతీయ స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హులైన బీసీ, ఇతర వర్గాల విద్యార్థులకు ఆంగ్లం, ఐఈఎల్‌టీఎస్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గద్వాల బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రొఫెషనల్, నాన్‌ప్రొఫెషనల్ కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ నెల 21వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారుల్లో బీసీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ఆ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదు



బింగిదొడ్డిలో నామినేషన్‌కు ముందు అభ్యర్థితో స్నిగ్ధారెడ్డి

అయిజ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓటు అడిగే హక్కు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు లేదని జిల్లా బీజేపీ యువనాయకురాలు డి.కే స్నిగ్ధారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ తరఫున బింగిదొడ్డి గ్రామాన్ని సందర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు గోపాలకృష్ణ బలపరిచిన అభ్యర్థితో నామినేషన్ వేయించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కుటుంబపాలన సాగించిన కేసీఆర్ కుటుంబంతో కలిసి ప్రజలను దోచుకోవటంతోనే సరిపోయిందని విమర్శించారు. అలాగే ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చలేక కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల మాటలతో మభ్యపెడుతోందని విమర్శించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఇప్పుడు కొనసాగుతున్న ప్రజాసంక్షేమ పథకాలు, జరిగిన, జరుగుతున్న అభివృద్ధి మొత్తం కూడా కేంద్రం సహకారంతోనే అన్నారు. బీజేపీపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అధికారం చేజిక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బబుల్‌రెడ్డి, క్రిష్ణ, భీమ్‌సేన్‌రావు, శంకర్, లక్ష్మణ్‌చారి, నాగరాజు, శివన్న పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దాం



ఎయిడ్స్ ప్రోగ్రాంలో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలను ఇస్తున్న డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి



ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో జమ్మిచేడులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

● డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి
● ప్రతిభ కనబర్చిన సిబ్బందికి సన్మానం

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్యాకిరణ్మయి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎయిడ్స్ సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జోగుళాంబ గద్వాల జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా మారేలా ప్రతీ వైద్యసిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం ఎయిడ్స్ ప్రోగ్రాంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌క్రాంతి, వినీమా, తేజశ్రీ, ప్రోగ్రాం అధికారులు రాజు, ప్రసూనారాణి, రిజ్వానా తస్వీర్, డీపీహెచ్‌ఎన్‌వో వరలక్ష్మి, డీపీఎల్ఎం నరేంద్రబాబు, జిల్లా ఎస్సీడీ కోఆర్డినేటర్ శ్యాంసుందర్, వైద్యసిబ్బంది ఉన్నారు.

● బాధితులకు ఉచిత న్యాయ సహాయం

ఎయిడ్స్ నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు బి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ/ ఎయిడ్స్ బాధితుల హక్కుల పరిరక్షణలో న్యాయసేవా సంస్థ సేవలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష పాటించడం, మానసిక వేధింపులకు గురిచేస్తే శిక్షలు తప్పవన్నారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం, మార్గదర్శకాలు, న్యాయ పరిరక్షణ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్స్ డిఫెన్స్ కౌన్సిల్ డి.లక్ష్మణస్వామి, డీఎంహెచ్‌వో ఉన్నారు.

● జమ్మిచేడులో ర్యాలీ

ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్(ఓఎంఐఎఫ్) మండల కోఆర్డినేటర్ అనురాధ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా జమ్మిచేడులో ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషితమైన సిరంజీలను వాడరాదని, హెచ్ఐవీ సోకిన వ్యక్తి రక్తాన్ని తీసుకోరాదని, హెచ్ఐవీ సోకిన వ్యక్తులతో లైంగిక సంబంధం పెట్టుకోరాదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డబ్ల్యూడీసీ విద్యార్థులు, టీచర్లు, ఓంఎంఐఎఫ్ హెల్త్‌వర్కర్లు, జోగినులు ఉన్నారు.

నామినేషన్ల ప్రక్రియ

సజావుగా చేపట్టాలి



కొంకల ఎన్నికల కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

● అదనపు కలెక్టర్ నర్సింగ రావు

వడ్డేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహిస్తూ అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు ఎన్నికల అధికారులకు సూచించారు. సర్పంచు ఎన్నికల సందర్భంగా రెండవ రోజు అభ్యర్థులు ఆయా క్లస్టర్ల పరిధిలో నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల, కొంకల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శిక్షణ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్, రాజ్‌కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా క్లస్టర్లలో అధికారులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, దరఖాస్తులు పూర్తి చేయడంలో అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేయాలన్నారు. అదేవిధంగా ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చూడాలన్నారు.

గ్రామాల్లో ప్రజలను ప్రలోభ పెట్టి సర్పంచు పదవిని వేలం వేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివకుమార్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో జ్యోత్స్న ఉన్నారు.

రెండవ రోజు నామినేషన్ల జోరు

మల్దకల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) స్థానిక సంస్థలకు జరుగుతున్న ఎన్నికలలో రెండవ రోజైన సోమవారం నామినేషన్ ప్రక్రియ కాస్త వేగం పుంజుకుంది. మొదటి రోజు మందకొడిగా సాగింది. మండలంలో 25 సర్పంచు స్థానాలకు మొదటిరోజు 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు. రెండవ రోజు 46 మంది వివిధ గ్రామాల్లో సర్పంచు స్థానాలకు నామినేషన్లు వేశారు. దీంతో ఇప్పటివరకు నామినేషన్ల సంఖ్య 68కి చేరిందని అధికారులు తెలిపారు. అదేవిధంగా 242 వార్డులకుగాను మొదటిరోజు కేవలం ఐదుమంది నామినేషన్లు దాఖలు చేయగా, సోమవారం 81 మంది నామినేషన్లు వేశారు. మొత్తం వార్డు సభ్యులు నామినేషన్ల సంఖ్య 86కు చేరిందని అధికారులు తెలిపారు.

రేపే ఆఖరు..

మొదటి రెండు రోజులు అరకొరగా నమోదైన నామినేషన్ల ప్రక్రియకు రేపుఆఖరి రోజు. ఇప్పటివరకు ఎల్కూరు, నీలిపల్లి, నాగర్‌దొడ్డి, కుర్తిరావల్‌చెర్వు, పెద్దొడ్డి, చెర్లగార్లపాడు, దాసరిపల్లి, నేతువానిపల్లె, అడివిరావల్‌చెర్వు గ్రామ పంచాయతీల్లో ఒక్కరు కూడా వార్డు సభ్యులకు నామినేషన్ వేయలేదని అధికారులు తెలిపారు.

● రాజోలి మండలంలో..

రాజోలి : రాజోలి మండలంలో సోమవారం 11 గ్రామ పంచాయతీలకు గాను 22 మంది సర్పంచు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. మండంలోని 110 వార్డు మెంబర్ స్థానాలకు 46 మంది నామినేషన్లు వేశారు.

● మూడు పంచాయతీలు ఏకగ్రీవం

అయిజ : మండల పరిధిలోని మరో మూడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అయిజలోని 28 గ్రామ పంచాయతీలకు రెండో విడతలో భాగంగా నామినేషన్‌ల ప్రక్రియ సాగుతోంది. రెండు రోజుల క్రితం కుర్వపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో సర్పంచు పదవులు ఏకగ్రీవం అయ్యాయి. సోమవారం మండల పరిధిలోని గుడిదొడ్డి రూ.17.10 లక్షలు, జడిదొడ్డి రూ.12 లక్షలు, వెంకటాపూర్‌లో రూ.20 లక్షలకు వేలంపాటలో సర్పంచు పదవులు దక్కించుకున్నట్లు సమాచారం.

చింతలకుంట సర్పంచు ఫలితం పెండింగ్‌లో ఉంచాలి

● కలెక్టర్‌కు సీనియర్ సిటిజన్ ఫోరం వినతి

గద్వాలటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పదంగా మారిన కేటిదొడ్డి మండలం చింతలకుంట సర్పంచు ఏకగ్రీవ ఎన్నిక ఫలితాన్ని పెండింగ్‌లో ఉంచాలని గద్వాల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మోహన్‌రావు కోరారు. సోమవారం స్థానిక ఐడీవోసీలోని కార్యాలయంలో కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గ్రామానికి చెందిన కుర్వ కుశ సర్పంచు పదవికి చివరి రోజు నామినేషన్ వేసేందుకు వెళుతుండగా కొంతమంది ఆయవద్ద నుంచి పత్రాలను తీసుకుని చించివేసినట్లు సోషల్ మీడియా ద్వారా బయటకు వచ్చిందన్నారు. ఈ విషయంపై గ్రామంలో గందరగోళం నెలకొందన్నారు.

సర్పంచు ఎన్నికను ఏకగ్రీవం చేశామని, తాను రూ.38 లక్షలకు వేలం ద్వారా దక్కించుకున్నానని, ఇతరులు ఎవ్వరూ నామినేషన్ వేయరాదంటూ జడ్పీటీసీ మాజీ సభ్యుడు, అతడి అనుచరులు బెదిరించినట్లు వీడియో చిత్రాలు ప్రచురితం అయ్యాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ఇలాంటి పరిణామాల మధ్య ఏకగ్రీవ ఎన్నిక ఫలితం ప్రకటించడం ప్రజాస్వామ్య ఎన్నిక ప్రక్రియను సందేహంలోకి నెడుతుందని కలెక్టర్‌కు వివరించారు.

ఎన్నికల సంఘం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల స్థాయిలోనే డిక్లరేషన్‌ను నిలిపేయాలని కోరారు.

పంచాయతీ ఎన్నికలు

పకడ్బందీగా నిర్వహించాలి



మానవపాడు: ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న అగస్టీన్

● వడ్డేపల్లి, అయిజ, మానవపాడు మండలాల్లో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

వడ్డేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శంగా నిర్వహించాలని ఎంపీడీవో రామకృష్ణ ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సోమవారం శాంతినగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రధానంగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, ఓటింగ్‌లో పాటించాల్సిన నిబంధనలు, రక్షణ, వసతి సౌకర్యాలు తదితర అంశాల గురించి వివరించారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ముఖ్యంగా నామినేషన్ పత్రాల స్వీకరణ, పరిశీలన ఆమోద ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో నరసింహులు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

● ఉత్తనూరులో..

అయిజ : మండలంలోని ఉత్తనూర్ గ్రామ రైతువేదికలో సోమవారం ఎన్నికల నిర్వహణాధికారులు పీఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి విడత ఎన్నికల్లో పాల్గొంటున్న వీరికి శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ భాస్కర్, విద్యాధికారి రాములు, మాస్టర్ ట్రైనర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల విధులు, నిర్వహణ గురించి వివరించారు. బాధ్యతయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చూడాలని తెలియజేశారు.

● పోలింగ్ అధికారులకు శిక్షణ

మానవపాడు : స్థానిక సంస్థల ఎన్నిక సందర్భంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రైనర్ అగస్టీన్ మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, దరఖాస్తుల దాఖలు, బ్యాలెట్ పేపర్లు, కౌంటింగ్ అంశాలపై వివరించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో విద్యుత్ ఏర్పాట్లు, ఇతర సామాగ్రి ఏర్పాటు చేయాలని సూచించారు. శిక్షణలో ఎంపీడీవో రాఘవ, ఎంఈవో పాల్గొన్నారు.